క్లుప్తంగా

నీటి సంఘాల ఓటర్ల జాబితా ప్రకటన

పాలకొండ: నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలను మంగళవారం ప్రకటించారు. ఓటర్ల జాబితాలను నగర పంచాయతీ, సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచామని తహసీల్దార్ బాలమురళీకృష్ణ తెలిపారు. రైతులకు సర్వే నంబర్లు ఆధారంగా ఓటు హక్కు కల్పించామని పేర్కొన్నారు. రైతులు జాబితాలను పరిశీలించి తమ ఓటు లేకపోతే సంబంధిత సచివాలయంలో తెలియజేయాలని సూచించారు.

సాత్విక్‌కు పసిడి పతకం



వీరఘట్టం: జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి అరగలి సాత్విక్ అండర్ - 14 వాలీబాల్ పోటీల్లో బంగారు పతకం సాధించి తన సత్తా చాటాడు. భోగాపురంలో ఈ నెల 9 నుండి 11 వరకు జరిగిన అండర్ - 14 వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి కప్పుతో పాటు బంగారు పతకాన్ని సాధించినట్లు పీడీ శిర్లాపు ఉమామహేశ్వరరావు మంగళవారం తెలిపారు. బంగారు పతకం సాధించి తమ పాఠశాల పేరు చాటి చెప్పిన సాత్విక్‌ను హెచ్‌ఎం బి.సాంబర, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామస్థాయి అభివృద్ధిపై శిక్షణ

సీతంపేట: గ్రామస్థాయిలో అభివృద్ధి పథకాలపై మంగళవారం గ్రామ కార్యదర్శులు, వీఓఏలు, డిజిటల్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలైన మౌళిక వసతులు కల్పన వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ మాస, ఈఓపీఆర్‌డీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

అక్షర వెలుగు శిక్షణ

సీతంపేట: స్థానిక మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అక్షర వెలుగు శిక్షణా కార్యక్రమం ఎస్‌హెచ్‌జీలకు నిర్వహించారు. వయోజన విద్య ఏడీ వైకుంఠరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్క మహిళా అక్షరాస్యులు కావాలన్నారు. రెండు రోజుల పాటు జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గిరిజన హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు రేపు

సీతంపేట: ఏపీ నేర పరిశోధనా విభాగం (సీఐడీ) అధిపతి రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశానుసారం ఈ నెల 14న స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గిరిజన తెగల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారని ఎస్ఐ వై.అమ్మన్నరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సీఐడీ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సారా పట్టివేత

వీరఘట్టం: మండలంలోని హుస్సేనుపురం గ్రామ శివారులో సారా తరలిస్తున్న బొమ్మాలి వాసును మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు హెచ్.సీ పి.కృష్ణంనాయుడు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్ల సారాను అతని నుంచి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రరావు

భామిని: గ్రామాల అభివృద్ధికి అందరి సహకారం అవసరమని ఎంపీడీఓ గెండెలా చంద్రరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు, డబ్ల్యూఏల శిక్షణలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు వచ్చే నిధులను పక్కా ప్రణాళికతో ఖర్చు చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రజారోగ్యానికి ఇందులో ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకుడు, రజకులు

కొమరాడ: మండల కేంద్రంలో జీసీసీ అధికారులు ఏర్పాటు చేయదలిచిన పెట్రోలు బంకుకు వ్యతిరేకంగా సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి ఆధ్వర్యంలో అక్కడి రజకులు మంగళవారం నిరసనకు దిగారు. ఇక్కడ పెట్రోలు బంకు నిర్మిస్తే తమకు జీవనాధారమైన చెరువు భూభాగం కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు నీటిని ఉపయోగించుకునే తామంతా బట్టలు ఉతుకుతూ బతుకుతున్నామని, బంకు ఏర్పాటు చేస్తే చెరువు భాగం కనిపించకుండా పోయే ప్రమాదం ఉందని వాపోయారు.

మరకత లింగేశ్వరునికి భస్మాభిషేకం



పాలకొండలోని లలితాత్రిపుర సుందరి ఆలయంలో కొలువుదీరిన శ్రీమృత్యుంజయ మరకత లింగేశ్వరునికి భస్మాభిషేకం పూజలు మంగళవారం జరిగాయి. స్వామికి ప్రీతి అయిన ఈ అభిషేక పూజల్లో భక్తులు పెద్దెత్తున పాల్గొన్నారు. వంద కేజీల భస్మంతో పాటు పంచామృత అభిషేకం, దశవిధ హారతులతో స్వామిని అర్చకులు శరత్‌కుమార్ తీర్చిదిద్దారు. శివ పంచాక్షరి నామస్మరణతో ఆధ్యాత్మికత సంతరించుకుంది.

– పాలకొండ రూరల్

అన్నదాత ఆందోళన



బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి ప్రభావంతో పాలకొండ మండల వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమైంది. దీంతో అన్నదాతలో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం మండలంలో ముమ్మరంగా వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఏమాత్రం వర్షం పడినా తీవ్ర నష్టం తప్పదని వారు ఆందోళన చెందుతున్నారు. పండిన పంటను దక్కించుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. పాలకొండ – వీరఘట్టం రహదారిలో రైతులు కోతలు పూర్తి చేసిన చేలను యుద్ధ ప్రాతిపదికన నూర్పిళ్లు చేపట్టి అక్కడే ఆరబెట్టి, బస్తాలకు ఎత్తుబడి చేసే పనిలో నిమగ్నమయ్యారు. ధాన్యం తడిచిపోకుండా అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టారు.

– పాలకొండ రూరల్

అవగాహన సదస్సుకు ఆహ్వానం



భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో విశాఖ రీజియన్ సీఐడీ ఎడిషనల్ ఎస్పీ జి.ప్రేమ కాజిల్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై బుధవారం నిర్వహించనున్న వర్క్‌షాప్‌కు హాజరై సహకరించాలని సీఐడీ సీఐ రమణమూర్తి మండల అధికారులను కోరారు. ఈ మేరకు వర్క్‌షాప్‌కు హాజరు కావాలని మంగళవారం పలువురు అధికారులను కలిసి ఆహ్వానించారు. తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఎంపీడీఓ జి.చంద్రరావు తదితరులను ఆయన కలిశారు. ఆయన వెంట ఏఎస్ఐ కాంతారావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

– భామిని

కలిసొచ్చిన గోబీ



- గతేడాది కంటే ధర, దిగుబడి అధికం
- ఇదే వాతావరణం కొనసాగితే మరింత మేలు
- మండల వ్యాప్తంగా 450 ఎకరాల్లో పంట సాగు
- ఉత్తరాంధ్ర జిల్లాలకు కాలీఫ్లవర్ ఎగుమతి

వీరఘట్టం:

ఇటీవల ప్రకృతి వైపరీత్యాల కారణంగా పచ్చిమిర్చి, వంగ తదితర పంటలకు కాస్త నష్టం ఏర్పడినప్పటికీ ప్రస్తుతం గోబీ పువ్వుల పంట కలిసి రావడంతో కూరగాయల రైతులు ఊరట చెందుతున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ధర, దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం పొందుతున్నారు. ప్రస్తుత వాతావరణం ఇలాగే కొనసాగితే పువ్వు సైజు పెరగడంతో పాటు మరింత ధర పెరిగే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పువ్వులను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ లాభాల బాట పడుతున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వీరఘట్టం మండలంలో సాగులో ఉన్న కాలీఫ్లవర్ పంటకు చాలా డిమాండ్ ఉంది. ప్రస్తుతం మండల వ్యాప్తంగా వీరఘట్టం, బూరుగ, కొట్టుగుమ్మడ, దశుమంతుపురం, కంబర, చిదిమి తదితర గ్రామాల్లో ఈ ఏడాది సుమారు 450 ఎకరాల్లో కాలీఫ్లవర్(గోబీ) పంటను సాగు చేస్తున్నారు. సెప్టెంబర్ నెలాఖరులో ఈ పంట వేసారు. గతంలో కురిసిన వర్షాలు కారణంగా తెగుళ్లు సోకినప్పటికీ రైతులు అవసరమైన మందులను సకాలంలో పిచికారీ చేయడంతో నష్టం కలగలేదు. దీంతో పంట పూతదశకు వచ్చేసరికి వారం రోజుల పాటు చలిగాలులు వేసి వాతావరణం మరింత అనుకూలించింది. దీంతో ఫలసాయం ఆశాజనకంగా కనిపిస్తోంది.

మూడింతల లాభం

గతేడాది ఎకరానికి 3 వేల నుండి 4 వేలు పువ్వుల వరకు దిగుబడి వచ్చేది. గత సంవత్సరం ఒక్కో పువ్వు ధర రూ.10ల వరకు ఉన్నప్పటికీ దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో అరకొర లాభాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది ధర, దిగుబడి అన్నీ కలిసి రావడంతో మూడింతల లాభం చేతికొస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరానికి అన్ని విధాలుగా వ్యవసాయ మదుపు కింద రూ.30 వేలు వరకు ఖర్చు చేసారు. ప్రస్తుతం ఇదే విస్తీర్ణంలో 7 వేల నుంచి 8 వేలు వరకు పువ్వులు చేతికొస్తున్నాయి. ఒక్కొక్క పువ్వు ధర సైజు ఆధారంగా రూ.15ల నుంచి రూ.20ల వరకు పలుకుతోంది. ఈ లెక్కన చూస్తే ఎకరా ఫలసాయం రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు వచ్చే అవకాశం ఉండడంతో రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది.



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న కాలీఫ్లవర్ పువ్వులు

ఇతర ప్రాంతాలకు తరలింపు

రైతుల వద్ద కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ఇప్పటికే శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖపట్నం, ఒడిశా వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం సీజన్ కావడంతో అన్ని చోట్ల డిమాండ్ కనిపిస్తుండడంతో వ్యాపారులు కూడా లాభపడుతున్నారు. వారం రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. కాలీఫ్లవర్ పువ్వులు ధర ఇటు రైతులకు, అటు వ్యాపారులకు బాగున్నప్పటికీ స్థానిక ప్రజలకు మాత్రం ధర చుక్కలను చూపుతోంది. ఇక్కడ పండుతున్న నాణ్యమైన పంట ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న పువ్వులను కొనుగోలు చేస్తున్నప్పటికీ ఒక్కొక్క పువ్వు ధర రూ.20 నుంచి రూ.25 వరకు ఉండటంతో భారం తప్పడం లేదు.

ఆశాజనకంగా ఉంది



ఎకరా విస్తీర్ణంలో ఈ ఏడాది క్యాబేజి పువ్వు పంటను వేశాం. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో ధర బాగుండడంతో మూడింతలు లాభం వస్తుందని అంచనా వేస్తున్నాం. బరంపురం మార్కెట్‌కు ప్రతీ రోజు కాలీఫ్లవర్ పంటను తరలిస్తున్నాం.

– బొద్దాన దుర్గారావు, రైతు, వీరఘట్టం

చలిగాలి పెరిగితే మరింత లాభం



ప్రస్తుతం పంట బాగున్నప్పటికీ చలిగాలి ఇంకా పెరిగితే పువ్వు సైజు పెద్దదిగా మారుతుంది. దీంతో ధర మరింత పెరిగే అవకాశం ఉంది. అరెకరా విస్తీర్ణంలో పంట సాగు చేస్తున్నాను. దిగుబడి బాగానే ఉంది. పది కిలోల క్యాబేజీ పువ్వులను హోల్‌సేల్‌గా రూ.300లకు విక్రయిస్తున్నాం. మార్కెట్‌లో వీటిని విక్రయిస్తే రూ.450 వరకు వస్తుంది.

– కర్రి నాగరాజు, కూరగాయల రైతు, వీరఘట్టం

2030 నాటికి నిరక్షరాస్యతను రూపుమాపుదాం



శిక్షలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

వీరఘట్టం: ప్రతీ గ్రామంలో 2030 నాటికి ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యతను పారద్రోలాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై ఎస్‌హెచ్‌జీ మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతీ పది మందికి ఒక వలంటీరు చొప్పున మండల వ్యాప్తంగా 143 మందిని డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న వారిని నియమించామన్నారు. మీరంతా మీ గ్రామంలో మీకు కేటాయించిన నిరక్షరాస్యులు కనీసం చదవడం, రాయడం నేర్చుకునేలా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని ఓ యజ్ఞంలా చేపట్టాలని ఎంపీడీఓ సూచించారు. ఆయనతో పాటు ఏపీఎం కెల్ల రాము, సీసీ ఆనందరావు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతోనే గ్రామాభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

వీరఘట్టం: గ్రామాభివృద్ధికి పక్కాగా ప్రణాళికలు ఉండాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జీపీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులను ఏయే పనులకు వినియోగించాలి...ఏ ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలి తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీధి దీపాల నిర్వహణ, కల్వర్టులు, వీధి రోడ్డు నిర్మాణాలు కూడా చేపట్టవచ్చునని సూచించారు. సమావేశంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

జియ్యమ్మవలస: మనబడి-మనతోట కార్యక్రమంలో భాగంగా మండలంలోని బిత్రపాడు ఎంపీయూపీ పాఠశాలలో కూరగాయల సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ పర్యవేక్షణలో ప్రకృతి వ్యవసాయం జిల్లా డీపీఎం షణ్ముఖరాజు విద్యార్థులతో కూరగాయ, ఆకుకూరల మొక్కలు నాటించారు. అనంతరం ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులకు చేపట్టాల్సిన చర్యలను విద్యార్థులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ పండించే పంటల ద్వారా వచ్చే ఆరోగ్యవంతమైన పంట మధ్యాహ్న భోజనం వంటకాలకు పనికి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయం వద్ద దుప్పట్లు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

పాలకొండ: పట్టణంలోని గటాలడెప్పి వీధిలోని సంపత్ వినాయక ఆలయం 29వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. భారీ అన్న సమారాధన చేపట్టారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించాలి



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిన్నారావు

జియ్యమ్మవలస: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు కోరారు. మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇటీవల ఓ విద్యార్థి మృతి చెందగా, ఆ పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యానికి సిబ్బంది తీసుకుంటున్న చర్యలపై ఆరాతీశారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్య, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పటిష్టంగా ఎస్సీ, ఎస్టీ చట్టాలను అమలుచేయాలి



మాట్లాడుతున్న సీఐడీ విశాఖపట్నం రీజియన్ అడిషనల్ ఎస్పీ ప్రేమకాజల్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కుల వివక్ష లేని సమాజం కోసం ఎస్సీ, ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సీఐడీ విశాఖపట్నం రీజియన్ అడిషనల్ ఎస్పీ డాక్టర్ జి.ప్రేమకాజల్ ఆదేశించారు. కురుపాం మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్సీ చట్టాలు, అత్యాచార నిరోధక చట్టం-1989 వంటి వాటిపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను పూర్తిగా అంతరింపజేయాలంటే పగడ్బందీగా ఎస్సీ, ఎస్టీ చట్టాలు అమలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తప్పు చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, సాక్ష్యాలు బలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ రీజియన్ డీఎస్పీ కె.కుమారస్వామి, సీఐ ఎం.బుచ్చిరాజు మాట్లాడుతూ 35 ఏళ్ల క్రితమే ఈ చట్టాలు ప్రారంభమైనప్పటికీ ఇంకా కులవివక్ష కేసులు నమోదు కావడం దురదృష్టకరమన్నారు. సమాజంలో అంతా సమానమేనన్న భావన అందరిలో కలగాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు టి.జోగారావు, పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, ఎస్సీ, ఎస్టీ సాధికారత షెడ్యూల్డ్ అధికారి గయాజుద్దీన్, ఎల్విన్‌పేట సీఐ బి.హరి, ఎంపీడీవో జె.ఉమామహేశ్వ, తహసీల్దారు రవణమ్మ, ఎస్ఐలు పి.నారాయణరావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలను పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్...



ఇసుక మేటలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఆర్ఐ

భామిని: మండలంలోని కాట్రగడ - బి ఓపెన్ హెడ్‌చానల్ వద్ద ఇసుక తవ్వకాలపై 'ప్రాజెక్టు వద్ద ఇసుక తవ్వకాలు తగవు' శీర్షికన సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఆర్ఐ కె.కృష్ణారావు, వీఆర్‌ఓ జి.వెంకటరమణతో కూడిన రెవెన్యూ బృందం మంగళవారం కాట్రగడ బి వద్ద ఇసుక తవ్వకాల స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత ఇసుక పంపిణీ స్టాక్ పాయింట్, ఇసుక తరలింపును పర్యవేక్షించారు. ఓపెన్ హెడ్‌చానల్ వద్ద పేరుకుపోయిన ఇసుకతీత నిలిపివేసిన ప్రదేశాన్ని, వంశధార ఎస్కేప్ కెనాల్ ప్రవేశంచే ప్రదేశాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం వంశధార ప్రాజెక్టు డీఈఈ భవానీశంకర్, ఏఈఈ జగదీష్ పరిశీలించి జిల్లా అధికారులకు నివేదించారు.

పంటకోత ప్రయోగం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం)/జియ్యమ్మవలస:

క్షేత్ర దినోత్సవంలో జియ్యమ్మవలస మండలంలోని తుంబలి గ్రామ వరి పొలాల్లో మంగళవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. కురుపాం మండలం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం(ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం) ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ, శాస్త్రవేత్తలు ఎస్.స్రవంతి, అనంత విహారిలు క్షేత్రంలోని నిర్దేశిత కొలతలోని పంటను తీసుకుని, అంచనా వేశారు. ఎకరానికి 17 నుంచి 18 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చినట్లు వారు నిర్ధారించారు.

గరుగుబిల్లిలో..

గరుగుబిల్లి: మండలంలోని ఉద్దవోలు గ్రామ వరి పొలాల వద్ద మంగళవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఏవో విజయభారతి పర్యవేక్షణలో వ్యవసాయ సిబ్బంది ఈ ప్రయోగం చేయగా, ఎకరాకు 27 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చినట్లు నిర్ధారించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా మండలంలో మొత్తం 128 పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు ఏవో తెలిపారు.



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న ఏవో

నాణ్యమైన విద్యనందించాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని డీఈవో ఎస్.తిరుపతినాయుడు సూచించారు. మండలంలోని తాటిశీల ఎంపీపీ పాఠశాలను ఆయన మంగళవారం ఉదయం సందర్శించి, అక్కడి సిబ్బంది, విద్యార్థుల హాజరు, రికార్డులు, బడితోట, పాఠశాల పరిసరాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలను అంచనా వేశారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని సిబ్బందికి తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందివ్వాలి



రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రతినిధి ప్రతిభ

గరుగుబిల్లి: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రతినిధి డాక్టర్ ప్రతిభ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఆర్‌డీవలస, ఉద్దవోలు ఆయుష్మాన్ కేంద్రాలను ఆమె మంగళవారం సందర్శించారు. అనంతరం ఆయా కేంద్రాల్లో నిర్వహిస్తున్న రికార్డులు, మందుల నిల్వలు, చేస్తున్న రక్తపరీక్షలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కేంద్రాలకు వచ్చే రోగులకు సకాలంలో సేవలందించాలని, మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని తెలిపారు. వీబీడీ కన్సల్టెంట్ శ్రీకాంత్, వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక ఏకాదశి



గరుగుబిల్లి: సాంబన్నవలసలో తిరువీధిలో భక్తులు



వీరఘట్టం: సత్యనారాయణస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పాలకొండ రూరల్: కార్తీక మాసంలో ఏకాదశిని పురస్కంచుకుని భక్తులు వైష్ణవాలయాలకు మంగళవారం పోటెత్తారు. ఓ వైపు ప్రస్తుత మాసంలో పూజలు అందుకుంటున్న మహాశివునితో పాటు విష్ణుమూర్తికి పూజలు చేయటంతో పట్టణ, మండల పరిధిలో ఆధ్యాత్మికత ఉట్టిపడింది. స్థానిక కోదండరామ, సీతారామాలయాలతో పాటు మండల పరిధిలో వివిధ గ్రామాల్లో గల రామమందిరాల్లో ఏకాదశి పూజలు పెద్దెత్తున జరిగాయి. పోస్టాఫీసు రహదరిలో గల సీతారామాలయం వద్ద భక్తులు స్వామి దర్శనం కోరి క్యూలైన్లలో బారులు తీరారు. అన్నవరంలోని వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వీరఘట్టంలో..

వీరఘట్టం: కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న విష్ణుక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి భక్తులు పోటెత్తడంతో ఆలయం కిటకిటలాడింది. అర్చకులు సర్వాజోస్యుల చంద్రమౌళీ శర్మ, సతీష్‌శర్మ, రమేష్ శర్మలు భక్తుల గోత్రనామాలతో పూజలు చేసారు. కడకెల్ల, తలవరం, బిటివాడ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

గరుగుబిల్లి: కార్తీక శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని, మండలంలోని కొత్తూరు, గరుగుబిల్లి, పెద్దూరు, గొట్టివలస, సాంబన్నవలస, గిజబ తదితర గ్రామాల్లోని ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి, మందిరాలకు పోటెత్తిన భక్తులు మనసారా దైవదర్శనం చేసుకున్నారు. ప్రత్యేక పూజలు, దీపారాధనలు, సామూహిక వ్రతాలు చేసి, ఉపవాసం ఆచరించారు.

భామినిలో..

భామిని: కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా వైష్ణవాలయాల్లో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉత్కళ సాంప్రదాయ గ్రామాల్లో హరేరామ నామ సంకీర్తనలు మార్మోగాయి. బత్తిలి, కాట్రగడ-బి, పసుకుడి, పాత ఘనసర, కొరమ గ్రామాల్లో భజనలు చేశారు. ఆలయాల వద్ద దీపోత్సవాలు నిర్వహించారు.

కొమరాడ: మండలంలోని కోటిపాం గ్రామంలో ఉన్న శ్రీవీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తులు ఏకాదశి పూజలు నిర్వహించారు. కార్తీక మాసం వేళ పూజల నిమిత్తం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో ప్రశాంత వాతావరణంలో భక్తుల దైవదర్శనం జరుగుతోంది.